# లకుమాదేవి

శ్రీ భావరాజు వేంకటకృష్ణరావు

లకుమాదేవి కొమరగిరిభూపాలుని భోగపత్ని-వారాంగన. ఆమహారాజేంద్రునికి కడు గూర్చు ప్రియురాలు.

కొమరగిరిభూపాలునకు వసంతరాయడని బిరుద మున్నది. అతడు నిరంతరానంత భోగస్వాదుడు, సుఖవిరాజితుడు, ఆంధ్రజగతీపతి. వైభవమున ఆఖండల సదృశుడు. ఈశాన్యభాగమున సింహాద్రి అతని రాజ్యమునకు ఎల్ల. నైఋత్యదిశయందు శ్రీశైల మాతని రాజ్యమునకు సీమ. పడుమటను కృష్ణానది వంటియున్న బహుమనీరాజ్యము సీమ. దక్షిణమున కాంచీపుర పాండ్య రాజ్యము సీమ. కుమారగిరిమహారాజు సుకుమారతరాకారుడు, సుందరుడు, రూపరేఖా విలాసములందు కంతుని, వసంతుని, జయంతుని గెలువ జాలినవాడు. సమస్త కళాకలాప చతురుడు. సంగీత సాహిత్యములందును నాట్యశాస్త్రమునందను ఆమహారాజేంద్రుని కభిమానము వర్ణనాతీతము. ఆపక్షపాతమును గ్రహించి ప్రభువు మన్ననకు పాత్రుడు కాదలచి దోరపరెడ్డి సేనాని, నరపాలునికి ఆబాల్యమిత్ర మగుటచేసి, సమస్త గాంధర్వ విద్యావేదినియైన ఒక జవరాలిని నట్టువను, కానుకగా సమర్పించెను. ఆజవ్వని రూపునకు చోద్య మంది భూమీశుడంతటనుండి యామెను తనకొలువుకూటమున నర్తకిగా నియమించెను. ఆమెయే లకుమ. కాపరట్టడికిని ప్రేంపల్లి భావనారాయణదేవరసుశిసాని వల్లెమకును జనియించిన యేకపుత్రిక యామె. లకుమ విదుషీమణి, కవయిత్రి, సంస్కృతాంధ్రము లందు స్వయముగా తన నృత్యగీతములకై గీతప్రబంధములు రచింపగలదు. గణికారత్నము, జగదేకసుందరి గావున హావభావవిభ్రమ విలాసములకు పుట్టినిల్లు.

కుమారగిరిరాజేంద్రుని ప్రమత్తతను జూచి హరిహరరాయడు మోపూరుసీమను, రేనాటిసీమను, త్రిపురాంతకసీమను, మోటుపల్లిసీమను బలాత్కారముగ ఆక్రమించుకొనెను. కాని అనతికాలమున కుమారగిరి భూవల్లభుని సేనబావ కాటయవేముడు మహాసైన్యసమేతుడై పోయి, శత్రువుల యధీనమైన రాష్ట్రములను మరల వశపఱచుకొనెను. హరిహరరాయలు కాటయవేముని పరాక్రమధాటికి నిలువజాలక అక్రమముగ తా నాక్రమించుకొన్న రెడ్డిరాజ్యభాగమును మరల భద్రముగ నొప్పగించెను. మరియు భవిష్యత్కాలమున కొండవీటికిని విద్యానగరమునకును వైరము రేకెత్తకుండ తన మనుమరాలిని వేముని తనూభవుడైన కాటచమూపతికిచ్చి యుద్వాహ మొనరించెను. ఈ వృత్తాంతము జరిగినతరువాత వచ్చిన మహాశివరాత్రికి కుమారగిరిరాజేంద్రుడు శ్రీశైలమునకు యాత్ర యరిగెను.

శ్రీశైలమున నుండగా అహోబల నృసింహుని సందర్శించు కుతూహలము గలిగెను. బాల్యమున దాను ఆప్యాయముగ చదివి యానందించిన శంభుదాసుని నృసింహపురాణములోని గాథ జ్ఞప్తికి వచ్చెను. అంతట అహోబలమునకు సమీపమున స్కంధావారమును నిర్మించి యందు విడిది దిగెను.

ఆనాడు ఫాల్గున శుద్ధపూర్ణిమ. ఓబలేంద్రుని కాదినమున మహావైభవముగ గరుడోత్సవము జరుగును. చెంచులక్ష్మితోగూడి పన్నగశయనుడు డోలాయాత్ర జేయును. ఆ బాలగోపాలము నాడు కామోత్సవము ఆనందింతురు. కామదహనమును శివలీలామాహాత్మ్యమును మహదానందముతో ఒరుపుదురు, ఆకర్ణింతురు.

ఆనాడు సూర్యుడస్తాద్రి గ్రుంకినప్పటికి డోలారోహణోత్సవము ముగిసెను. మహారాజు ఇంచుక బడలియుండి సపరివారముగ అంతఃపురమునకు జనెను. పిదప పన్నీట జలకములాడి అలంకృతుడై కొలువు కూటమునకేతెంచి యచ్చట నృసింహదేవుని సముఖమున తనకై వేయబడిన పూసెజ్జపై గూర్చుండి, రాత్రి ప్రొద్దుపోవుటకు నృత్తగీత వాద్యముల నానందింపగోరెను. అంతవఱకు మహారాజుసన్నిధానమున నాట్యము సలుపుట

కవకాశము దొరకని కారణమున వాపోవుచున్నది లకుమ. భూరమణుని మనోభావము కల్లడింపబడగనే తాను నాట్యముచేయుటకు జగతీపతి అనుమతి వేడ దలచెను. లకుమ ఆకేయి మహారాజు మ్రోల మనోహరముగ నాట్య మభినయించెను. కామదహనమును, రతివిలాపమును, తాను రచించిన సంస్కృతాంధ్రగీతికలను మంజులశ్రుతిని సంభావ్యసుగతులను బాడి సద్భావాశ్రయములను రసాశ్రయములు నగు ఘట్టములను లావణ్యము ముప్పిరిగొనునట్లు అభినయించెను. ఆమె నాట్య మంజులసంగీతనైపుణ్యములకు మహారాజహృదయము కరగిపోయెను. ముప్పది గడియల రాత్రి మూడు గడియలట్లు గడచిపోయెను. రతివిలాపానంతరమున నటరాజు తాండవమును పాడెను. నృత్యము చేయుచు అభినయించుతరి లావణ్యమయమై ఉజ్జ్వలమై ప్రకాశించు లకుమను గాంచి మహారాజు అపరిమిత సంతుష్టాంతరంగుడై బావ కాటయవేమారెడ్డివంక అపాంగవీక్షణముల చిరునగవు నటించుచుండ జూచి "బావా! మీ రభ్యసించిన భరతనాట్యశాస్త్రమునకే లావణ్యవతి సంపూర్ణవ్యాఖ్య కాదు గదా!" అని మేలమాడెను. మహామతియగు కాటయవేముడు రసాశ్రయుడైన తన ప్రభువర్యుని చిత్త మెరిగి తక్షణము ఆసనము డిగ్గి అంజలి ఘటించి ప్రభువరేణ్యుని యభీష్టము నెరవేరక పోదని సవినయముగ ప్రసన్నతతో బలికెను. సుహృష్టుడైన కుమారగిరిభూదేవేంద్రుని ముఖముపై హాసభావ ముదయించి కాంతులు వెదజల్లెను.

పిమ్మట ఆరాజచంద్రుడు తన మెడలోనున్న తారహారమును వెలికి దీసెను. మహారాజు మనోభావ మెరిగెను నట్టువ లకుమ. తన నాట్యభంగిమలచే రాజపరమేశ్వరుని చిత్త మలరింపజేసిన యా తన్వంగి మెల్లమెల్లగా అభినయించుచు, నృత్యము సలుపుచు భూమీశుని పూసెజ్జ చేరెను అంతటనప్రయత్నముగ మహారాజు చేతులనున్న హారము లకుమకంఠసీమ నలంకరించెను. ఆసన్నివేశమునకు కొలువెల్ల చిత్రమైన దీప్తితో నిండిపోయెను. నూరులకొలంది నేత్రము లచ్చెరువుతో మహారాజు మ్రోల నిలిచియున్న లకుమను గాంచి విభ్రాంతులయిరి. భూరమణుని చూచి హర్షమును బ్రకటించి కొలువుకూటము ఒక్క ముహూర్తకాలము చీమ చిటుకనకుండ నిశ్శబ్ద మైయుండెను.

కొమరగిరిదేవేంద్రునిమన్నన లకుమకు తలవని తలంపుగా సంప్రాప్తమయ్యెను. కాని - తానెక్కడ క్షుద్రవారాంగన - నట్టువపట్టి; ఆంధ్రక్ష్మామండలాఖండలుడు, జగత్ప్రసిద్ధుడు, పూజ్యుడు, ధరయేలిక కొమరగిరి క్ష్మారమణు డెక్కడ! సాహసమున అపచారము నొనరించితిని అని అనుకొనుచు నిలువెల్ల నీరయిపోవుచుండ, నొక్క త్రుటిలో అప్రయత్నపూర్వకమైన నాట్యముచేతనే కాళ్లగజ్జియలు ఝుళంఝుళ ధ్వనిచేయుచుండ కరపల్లవములందలి కంకణములు మంజులముగ రవరవధ్వని చేయుచుండ విషణ్ణయై పృథ్వీశుని మ్రోల సాష్టాంగముగ బడియెను. పారపాశ్చ్యములేసి యామె నెద్దియములందు గారవము గలిగి యా మనుజేంద్రుడు ఆమెను సముచితరీతి నింకను సంభావింపదలచెను. లావణ్యరాశియైన యా జవ్వని మృదుమాళినుండి రాలిన పువ్వుచయము శ్రీపాదములను పూజించిన ట్లయ్యెను. ఆ కమలేక్షణ ధరియించిన పాపటచంద్రునిలోని మాణిక్యదీప్తులు శ్రీపాదపద్మములకు వన్నె పెట్టకలిగెను.

"జగత్పతులకు - సార్వభౌములకు మహాపరాధము సల్పితిని. మహాపరాధము, మహాపరాధము సల్పితిని. రక్షింపుడు, రక్షింపుడు" అను మాటలు ఆయాసమును బ్రకటించు క్షీణస్వనముతో రాజచంద్రుని చెవులకు సోకెను. మంజులసంగీతసాహిత్యనాట్యాభినయములచే పరితుష్టుడైన మహారాజునకు లకుమయం దట్టి అవివేకమును స్ఫురింపలేదు. కరశాఖాంచలముచే కొంగు స్పృశించి యా నట్టువను లేవనెత్తెను. ఆమెదెస గనుగొని సాదరదరహసితరుచిరాననుడై— కర్పూరసహితంబగు తాంబూలమును బెట్టి, చిత్రములగు చీనాంబరముల నొసగి, మణిమయంబులగు నాభరణంబు లిచ్చి సంభావించెను. లకుమయు చిత్తము రంజిల్ల, ననుసిగ్గు తనువెల్ల ముంచివేయ, కనురెప్ప లెత్తకుండ ప్రసన్నుడైన మహారాజు దివ్యసుకుమారసుందరమూర్తిని గాంచి ఉప్పొంగెను. రాజేంద్రు డొకసారి యామెను అపాంగ వీక్షణముల బరికించెను. ధరణీవల్లభుడు, తనవంక కటాక్షవీక్షణ

ములను బరపినా డని సమ్మోదముతో శిరముపై కేలు దోయి ముకుళింపజేసెను. ఇంతలో వైతాళికులు బ్రాహ్మీముహూర్తము సమీపించుచున్నదని తోపించుటకు సముచిత రాగముల నాలపింపసాగిరి. కాల్య కృత్యములను దీర్చుకొనుటకు మహారాజు అంతిపురమునకు మందగమనముతో దారిదీసెను.

* * *

కొమరగిరి భూపాలుడు అహోబలమునుండి శిబిరమునెత్తివైచెను. చైత్రపూర్ణిమకు ఆతని కిష్టదైవమును, కులదైవమును అగు త్రిపురాంతకుని సందర్శింప కౌతుకమతియయ్యెను. తనరూపువా డనియు తనపేరివా డనియు కుమారగిరికి త్రిపురాంతకునిపై భక్తివలపు మెండు.

చైత్రపూర్ణిమ ఏతెంచెను. కుమారగిరి, ఆనాడు విషువత్పుణ్యకాలమున త్రిపురాంతకేశ్వరశివునకు భూదానము లనేకము గావించెను. ఆనా డచ్చట వసంతోత్సవమును ప్రారంభించి యైదుదినములు వరుసగా జరిపింపదలచెను. పోయిన త్రిపురాంతకసీమను మరల గెల్చి సంపాదించిన పిదప ఆనాడే మొదటిసారి వసంతభూపాలుడు గుదముతో వసంతోత్సమును జరుపుట. కొండవీటినుండి మహారాజు పరివారమంతయు త్రిపురాంతకమును చేరెను. త్రిపురాంతకమే కొండవీటిని మరపించునట్లు మిక్కిలి రామణీయకముగ నలంకరించినారు. మహారాజు శిబిరమునందు, అంగడివీధులందు, వీధీవిటంకములందు, చందనమున కలయంపి చల్లినారు. కర్పూరరజమున ముగ్గులిడినారు. కుంకుమ పువ్వుతోడను రంగవల్లికలు దిద్దినారు. అరవిచ్చిన తామరపూవులను అందందు తోరణములు గట్టినారు. అగరుధూపాది వాసన లచ్చట కాపురముండునట్లు అమర్చి యుంచినారు. కాముని కొలువు చేతకై అంతయు సిద్ధపరచినారు.

వసంతోత్సవ ప్రారంభమునకు బూర్వము వసంత భూపాలుడు ప్రియాంగన లెల్లరును తన్ను పరివేష్టింప అభ్యంతరశాలయందు నిర్మింపబడిన మన్మథమంటపమునందు రెండవ కాముని వలె ప్రకాశించుచు పూ బాన్పుపై నొయ్యారముగ వసించి యుండెను. చైత్రోత్సవ సూచకమైన రాగ మాలపించి, నాట్యము ప్రారంభింప వలసినదని మహారాజు ఆదేశించెను.

అంతట చరణములు, నడుము, చన్నులు, గన్నులు, జవ్వనము, వేనలి అన్నియు గలసి ఒక్కుమ్మడి సౌందర్యమును నివ్వటిలచేయుచుండ, లకుమ అలరు విలుతుని పూవుటమ్మువోలె కొలువు ప్రవేశించి, ప్రభువరేణ్యునకు ముందు జోహారుచేసి పిదప అఖండకర్పూర నీరాజన మిచ్చెను. మహారాజు ఆమెను అంతట నాట్యము అభినయింప సెలవొసంగుచు బహూకరించెను.

అంత టాపె చందురు కావిపావడపై సరిగంచుచీర బిగియించి నాట్యమున కుపక్రమించెను. అపుడు తాళమానజ్ఞలు ఒక వంకను మార్దంగికు లొక వంకను నిలువబడిరి. ముఖవీణె వాయించువా డొకడు ఒక ప్రక్కను, రాగములు ఆలపించు రమణు లిరువురు వెనుక ప్రక్కను వేడుకతో నిలచియుండిరి. అపుడు సౌందర్యఖనియైన లకుమ వేత్రపాణికి నమస్కరించి పాదములకు గజ్జియలు ధగియించి సిగ్గును సంభ్రమమును తొట్రుపాటు పడుచుండ అపాంగవీక్షణముల మహారాజును పరీక్షించి నాట్యమున కుపక్రమించెను. నాట్యవిధములను గతులను తాళములను ముందుగ నభినయించి, ఆపడుమ సప్తతాండవములను సలిపెమ. ఆమె నాట్యమును జూచి, సంగీతమును వినవచ్చిన సభవా రెల్లను చోద్యమందిరి. ఈపె ముందర రంభాదులు నిలుచుటకైన నీడ కలదె! అనుచు లోలోన నాశ్చర్యమునొందిరి. లకుమ వరుసగా నానార్థకరములగు నాట్యహస్తములు ప్రదర్శించెను. శిరము, చూడ్కులు, చెక్కిళ్లు, కనుబొమలు, మొదలగు అంగోపాంగముల నాట్య మభినయించెను. పిమ్మట త్రిపురాంతకుని మహిమలు వర్ణించుచు సంస్కృతాంధ్ర వాఙ్మయగీతముల నాశువుగ రచించి, మనోహరముగ పాడి, భావము లెస్సగా ప్రకటితముచేయుటకు అంగాభినయము సలిపెను. అంతట కామోత్సవసూచకములయిన శివుని దారుకావనవిహారమును పాడి నటియించెను. ఆమె నాట్యసౌరభము, కుమారగిరివర్యుని ఆశ్చర్యమగ్నమానసునిగా జేసివైచెను. ఆతడు పరితుష్ట హృదయమునందు పొంగిన ఆవేశముచొప్పున, "బళిరే! లకుమ

నీనాట్యమహిమ నిజముగా వేల్పుచేడియలను ఊర్వశీ తిలోత్తమాదులనుగూడ సిగ్గుపడచేయుచున్నది. బాపురే!" అని హెచ్చరించెను.

అంతలో కామదేవునిపూజకు వేళ యతిక్రమించుచున్నదని వైతాళికులు దెలుపసాగిరి. మహారాజును ఆసందడి నాలకించి యిరువు రిందీవరాక్షులు కైదండ యొసగ పాన్పునుండి దిగెను. ఇరుపార్శ్వములందు అప్రమత్తలైన యిందుముఖులు మహారాజునకు వింజామరలు వీచిరి. మెడలోని తారహారములను పుష్పహారములను సవరించుచు తరుణు లిరువురు చెంత నడువ, వేత్రహస్తులయి స్త్రీలు ముందు బరాబరులు తెలుపుచు జయవెట్టి నడువసాగిరి.

కామదేవుని పూజకు వసంతోత్సవములందు ధర్మపత్నుల పనిలేదు. వారును పాల్గొనవచ్చును. కాని ప్రియాంగనలతోగూడి జరుపవలసిన దీపంచబాణుని పూజావిధానము — భోగపత్నుల కిట్టియెడ అధికారము విశేషముకదా! మహారాజు విరిపాన్పు దిగి నలుదిక్కులనొకసారి పరికించి కలయచూచెను.

అందు కొల్వులోని మవ్వపుతీగెలం దెగడు మానినులు, జవరాండ్రు, కన్నియలు ఎంద రెందరో ప్రవేశించుచు బోవుచుండిరి. మహారాజు ప్రసన్నత యే లతాంగిపై ప్రసరించునో? ఏపూవుబోడి ప్రభువు మన్ననల నొంది మన్మథపూజకు నోములు నోచుకొనియున్నదో? అందందు అందరందరు ఉబ్బూతలూగుచుండిరి. ముందు మహారాజుమార్గమును జూపవలయును. అంతట తక్కుంగల రాజన్యులు, చిత్తమున కెక్కిన యట్టి విలాసినులకు కయిదండ యొసగి పిలుచుకొనిపోవుదురు.

మహారాజు మెలమెల్లగా రాజసముతో, భూమి కంపించునటుల అడుగులిడసాగెను. ఆ సంరంభమున రాజేంద్రుడు చెలియొకర్తుక చెంగట నుంచిన బంగారు పాదుకలను దొడుగ మరచిపోయెను. మహారాజు చిత్తము ఎవరితను ప్రసన్నురాలను చేయనున్నదో.

అంతట మెల్లగా వసంతభూపాలుడు, సిగ్గుచే తల వంచుకొని, ఆపాదమస్తకమును గడగడ వడకిపోవుచున్న నాట్యసుందరిని సమీపించెను. నట్టువగణ మంతయు చోద్యముంది చేష్టలు దక్కి చూచుచుండిరి. లకుమ ఇంకను దలయెత్తి చూడలేదు. మహారాజు ఆమెను సమీపించి — ఆమె పాణిపద్మమును తనకరపల్లవమునందు మెల్లగా చేర్చి,—" దేవి! లకుమాసుందరీ " అనుచు ప్రేమతో సంభావించెను.—

నిశ్చేష్టురాలయ్యెను లకుమ. ఒక క్షణములో నామె బ్రహ్మాండమునంతయు నిండిన ప్రేమాధిరాజ్య పీఠమున నధివసింపగలిగితి నని ఆనందపరవశురాలయ్యెను. ఆపారవశ్యమున ఆమెకు మేన పులక లంకురములయ్యెను. " నాజీవితము, నాసౌందర్యము, నాజవ్వనము, నానాట్యాభినయము, నామంజుల సంగీతము అన్నియు, జగత్ప్రభువుల పాణిస్పర్శచే ధన్యత నొందినవి. ఈదాసురాలి ననుగ్రహించుటకు ధరణీశు లెంతటి మహోదారులోగదా!" అనుచు మందహాసముతో క్రీగంటిచూపుచే మహారాజును పరితుష్టునిచేసెను. ఒక లుప్పొంగుచుండ, ఒండొరులు ఒకరి మేనులపై నొకరు వ్రాలిరి. కీలుబొమ్మవోలె లకుమ మహారాజునురముపై తలవాల్చెను.

వసంతోత్సవములు వర్ణనాతీతముగా జరిగిపోయెను. లకుమాదేవిని భూమీశుడు మన్నించి భోగపత్నిగా నంగీకరించెను. ఇపు డామెకు రాణివాసమున నెలవు కుదిరినది. ఆమె పృథ్వీశునకు హృదయేశ్వరి అయినది. కాటయవేముడు తనయేలిక కుమారగిరి ప్రభునకు సమ్మోదమును గూర్పదలచెను. లకుమాదేవి భరతశాస్త్రపాటవమును గాంచి సంగీతకళానైపుణ్యమును విని యానందించినపిదప నాతడు భరతశాస్త్రమునకు వ్యాఖ్య రచించి, దానికి వసంతరాజీయ మని పేరిడి, ఆంధ్రోర్వీశునియనుమతి బొంది యాతనికి అంకితమిచ్చి చిరకీర్తి సంపాదించుకొనెను.

లకుమపై ప్రేమచొప్పున కొమరగిరి వసంతభూపాలుడు ఆమె నివాసమునకై గృహరాజమును నిర్మించెను. అది మూడంతస్తులు గల ఒంటిగోపురపు పెద్దమేడ. శోభనము ముడివడునట్లు అలంకరింపబడిన యాగృహరాజమును వీక్షించుటకు తలలెత్తి చూడవలయును. దాని సౌందర్యమును వర్ణింప శేషునికైన అలవికాదు. దానిచుట్టును. అనంతము లయిన కేళీసరస్సులు, పూదోటలు, పూవు

పొదరిండ్లు, లతామంటపములు, అనేకములు గలవు. పువ్వు సౌరభమును దశదిశలందు వెదజల్లుచుండు పుష్పజాతులు అచ్చట నుండునట్టివి భూమిపై నన్నియు నొక్కచోట నక్కడున్నట్లు ఎక్కడను గాంచము. గృహరాజమందు ఎల్లవేళల కస్తూరి, కుంకుమ, కాలాగురు, సంకుమదము, చందనము, గంధసారములు పరిమళములు వెదచల్లుచుండెను. గృహరాజమునందే యొక కేళిసరసు గలదు. వసంతభూపాలుడు ప్రియాంగనతో జలక్రీడ లాడుటకు దానిని పనిబట్టి నిర్మించినాడు. అందు శిలానిర్మితములయిన గోడలందు చిత్రములయిన చిత్తరువులను వ్రాయించినాడు. వాటిపై కాంతి వెదజల్లుటకు అందందు వజ్ర వైడూర్య, మాణిక్య, గాణిక్యములను బొదివించినాడు. కుమారగిరి యభిమతమును దెలిసి, శిల్పులును, కాశివారును, సెలయేటివంటి ప్రవాహమును, క్రిందినుండి ఉవ్వెత్తుగ పైకెగసి నర్దాసల నీటిని వెదజల్లు నిర్ఝరీప్రవాహమును నిర్మించిరి. అందుండి సువాసనలతో నిండిన పూనీరు పైకెగయుచుండెను. అందు చుట్టునుగల గోడలందు లోహనిర్మితము లయిన నిలువుటద్దముల నిలిపి యుంచిరి. కేళిసరసు చుట్టును పూదోట నమరించియుంచిరి. అందందు లతామంటపములు పూవుబాన్పులు నెలకొల్పియుండిరి.

గృహరాజమునందు మొదటి యంతస్తునందు నాట్యశాల గలదు. అచ్చట వేడుక జనించినపుడు మహారాజు మ్రోలను లకుమ చిత్రగతుల నాట్యాభినయములు చేయుచుండును. సంస్కృతాంధ్ర వాఙ్మయ గీత ప్రబంధములను పాడుచుండును. నాట్యశాలకు నాల్గువైపులందును సంగీత సాహిత్య, భరత నాట్యాది శాస్త్రములందు పూర్వులు రచించిన మహాగ్రంథముల నన్నిటిని లకుమాదేవికొరకై కుమారగిరిభూపాలుడు, సేకరించి భద్రపరచి యుంచెను. సకల కళాకలాపచతురు డని సార్థకత సంపాదించెను. నిక్కముగ కళాప్రపూర్ణు డయ్యెను. సంగీత, భరతాది విద్యలందు తీర్ణులైనవారికి పారితోషకము లిచ్చి వారొసగిన గ్రంథములను సాంతముగ బరికించి విద్వాంసు డయ్యెను. అతడు చూడని గ్రంథముగాని, సేకరించని పుస్తకముగాని లేదు. సంగీతనాట్యశాస్త్రములందు లకుమాదేవి కుమారగిరిధీవర్యుని ప్రాపు గల్గి రంభాది దివ్యాప్సరసలకు మిన్నయని గణుతికెక్కెను. ఆ కాలమున లకుమాదేవికి గల్గిన ప్రశస్తి ఢిల్లీసురతాణికిని గూడ లేదన్న నతిశయోక్తి కాజాలదు! ఆమెను ఒకసారి సందర్శించి, ఆమె యనుగ్రహమును సంపాదించి, యామె సౌజన్యమున నామె ప్రకటింపగల సంగీత కళాకౌశలమును నాట్యాభినయ నైపుణ్యమును అలవరుచుకొనదలచి, అందలిమినుకులను గ్రహింపదలచి, జవ్వనులగు సుందరు లెందరో అటు కాంచీనగరమునుండి, విజయనగరమునుండి, ద్వారసముద్రమునుండి, ఇటు కలుబరిగెనుండి, కటకమునుండి, అటు దేవగిరినుండి ఢిల్లీనుండి, కొండవీడు చేరి కాపుర ముండజొచ్చిరి. "లకుమాదేవి వారాంగన, సామాన్యురాలుగ నెంచరాదు. ఆమె సర్వజగత్ప్రసిద్ధ సుమనోబాణాసనామ్నాయ విద్యోపాధ్యాయినిగదా! కొమరగిరి వసంత భూపాలోపాత్త గోష్ఠీప్రతిష్ఠాపారీణగదా!" అనుచు లకుమాదేవిని కొనియాడలివారు రెడ్డిరాజ్యమునందు గానరాకుండిరి.

గృహరాజమునందు మూడవయంతస్తుపై లకుమాదేవిశయ్యామందిరము గలదు. అందు అమర్పబడియుండు ధర్మపాంచాలికలు పృథ్విపై మరియొకచోట చూడబోము. అందు బంగరుతూగుటుయ్యాల కలదు. అందుండు చిత్రములు వర్ణింప నెవరితరము? అందు గోడలపై చిత్రములు రచించినారు. ఒకచోట దారుకావనభూమి, ఒకచోట యమునాతీరము. గోపకన్యలతో విహరించు గోపాలుని రహస్యక్రీడ లన్నియు అందందు మనోజ్ఞముగ చిత్రింపబడియుండెను. ఒకచోట తారాశశాంకుల సరససల్లాపములు, ఒకచోట అహల్యాసంక్రందనుల క్రీడావిహారములు, ఒకచోట పరాశరుని మోహవివశత, ఒకచోట కిరాతార్జునీయకథ — ఒకచోట ఉత్తరరామచరిత్ర యిట్లనేకకథలు అచ్చట కుడ్యభాగములందు చిత్రితములై యుండెను. అది ఒకవిధముగా శయ్యామందిరము. ఒకరీతిగా చిత్రశాలయునుగూడ. ఆ మందిరమున కావల గృహరాజమునకు సౌందర్యమును గూర్చు గాలిగోపురము గలదు. అం దుపవసించి చూచిన కొండవీడు ఏడుప్రాకారములును నగరమును సమస్తమును మనోజ్ఞమై కానిపించును.

లకుమాదేవీ కుమారగిరుల ప్రేమైకజీవితము పండువెన్నెలవలె దశదిశాంగణములందును పరిమళించుచుండెను. కాని యది రెడ్డిసామ్రాజ్యలక్ష్మీసవతిపోరునకు గారణమయ్యెను. రెడ్డిక్ష్మారమణి, లకుమతో, కుమారగిరిభూమీశుని ప్రేమను పంచుకొని యనుభవింప నోచుకొనలేదు. అంతట వింతలు పొడసూపెను. కొమరగిరి వసంతభూపాలుడు సకలవసుమతీరాజ్యభారమును తనబావ వేమారెడ్డి భుజాస్కంధముపై మోపి, తాను హాయిగ సుఖవినోదగోష్ఠిలో కాలము బుచ్చుచు దేవేంద్రునిపగిది నుండెను. అట్లు కొన్ని దినములు, వారములు, మాసములు, సంవత్సరములు గడచిపోయెను. ఒకవంక మహాపరాక్రమశాలి బావ, సచివుడు, నెచ్చెలి, చమూపతియునై రాజ్యమును రక్షింపుచుండ నొకవంక అవచి త్రిపురారి, సెట్టియై ద్రవ్యమును కొఱతలేకుండ నొసగుచునుండ కొమరగిరి భూలోకదేవేంద్రునివలె ప్రకాశించెను.

*                    *                    *

కాని కొన్నిదినములకు విపరీతములు పుట్టెను. లకుమాదేవి యదృష్టము ఈర్ష్యకు గురియయ్యెను. కొమరగిరిభూపాలునకు లకుమాదేవిపై అసూయ జనింపచేయుట కెవరో పన్నాగములు పన్నిరి. లకుమాదేవి తనప్రాణము, తన సర్వస్వము మహారాజుపాదములపై సమర్పించెను. కాని దుష్టవార్త యొకటి రాజేంద్రుని చెవిసోకెను. భూమిపాలున కీమాట విషముతో నింపిన బల్లెపుపోటువలె బాధ కలిగించెను. తొలుత ఆ నిందను విశ్వసింపలేకపోయెను. కాని పరీక్ష కావలయునని యాతనికి తోచెను. వజ్రసన్నిభమైన యారాజశేఖరుని హృదయకంచుకము ద్రయ్యలయ్యెను. అమృతభాండమున విషము చిందెను. ఆతడు నమ్మలేకపోయెను. నమ్మక ఉండలేకపోయెను. అంతట నాతడు గృహరాజమునకు బోవుట మానుకొనెను. మహారాజు ప్రవర్తనము లకుమాదేవికి వింతగా కనుపట్టెను. మహారాజునకుచుట్టును అంధకారము వ్యాపించుటచే చిత్తశాంతి లేకపోయెను. లకుమకు ప్రాణేశుని యాదరణములేమిచే ఆశ్రయములేనిదయ్యెను. అనురాగాతిశయముచే, ఆమెను మహారాజు శిక్షింపలేదు; పరీక్షించుటకైనను సాహసింపలేకపోయెను. ఒకవంక స్వాభిమానమును, మానసంరక్షణాభిలాషయు మరియొకవంక హృదయేశ్వరి యగు లకుమాదేవిపై మోహమును, ఆతనికి కర్తవ్యమును దోపకుండ చేసెను. ఈ అంతఃపురద్రోహము చేసిన ఆపాతకుని శిక్షించుటకుగాని, ఆతని విమర్శించుటకుగాని యాతడు పూనుకొనలేకపోయెను. చపలచిత్తయైన దోషము స్త్రీదిగాని పురుషుని దెట్లగును? అని యాతడు వితర్కించుకొనెను.

కొన్ని దినములు, నెలలు, క్రమముగా దీర్ఘములై గడచిపోయెను. చివరకు రాజేంద్రుడు సాహసించెను. గృహరాజమునకు గజారూఢుడై యరిగెను. మూడవ అంతస్తుపైకి శయ్యామందిరమునకు మెల్లగా నెక్కిపోయెను. 'ఇన్ని దినములకు మహారాజునకు మాదేవిపై యనుగ్రహము కలిగెనని దాసీజనము, పరిచారికలు తత్తరమంది, లకుమాదేవితో విన్నవించిరి. అంతటంతట జాగుసేయక లకుమ సింగారించుకొని, సర్వసన్నద్ధయై మహారాజును సమీపించి ఆయన పాదములపై సాష్టాంగముగ ద్రాలెను. ఆమె కన్నీటిచే మరల రెండవసారి శ్రీపాదములు తడిసిపోయెను. అందు పాపటచంద్రునుండి పద్మరాగములు మునుపటియట్లు శ్రీపాదపద్మములను రంజింపజేయలేదు. 'జగత్ప్రభూ, రక్షింపుడు — ఈదీనురాలు దోషిగాదు' అని గద్గదికతో ఎట్లో పలికెను.

మహారాజు హృదయము చలించెను. కాని లకుమను తన పాణిపల్లవముతో లేవనెత్తలేదు. 'లకుమా! — నెమ్మ నిన్ను పరీక్షింపవచ్చినాడను' అని పలికెను. "ప్రాణేశ్వరులకు దయకలిగిన దదియే చాలును. అదియే మహాప్రసాదము".

"నీవు నిర్దోషివని నిరూపించవలయును."

"దేవరయాజ్ఞ శిరసావహించుచున్నాను."

ఆ యుభయు లంతట శిలాప్రతిమలట్లు కొంతవడి నిశ్చేష్టులయి నిలువబడిపోయిరి. వసంతభూపాలుడు ఎత్తిన చూడ్కులు దింపకుండ నట్లె కొన్నిక్షణములు శూన్యదృష్టితో చూచునట్లుండెను. కాని ఆతనిమనోవీథియందు ఎన్ని భావములు పుట్టి, పెరిగి, విరిగిపోయెనో? ఆతని హృదయ

సీమయందు కాఠిన్యము కొనతేలినకొండవలె నుండి పోయెను. మహారాజు ముందునకు నడువసాగెను. ఆతని యభిమత మెరిగినయట్లు లకుమాదేవి వెంబడించెను. దాస దాసీజనము భయభ్రాంతులయి గుసగుసలయిన నాడుటకు సంశయించి నివ్వెరపాటు చెందియుండిరి. ముందు కొమరగిరిరాజేంద్రుడును, ఆ వెనుక కారు మేఘమువంటి వెలుగు మెరుపుతీగెచందమున లకుమ గృహరాజు మేడ ఉపరిభాగమునకు మెల్లగా నడచి పోయిరి. అక్కడనుండి గాలిగోపురములోనికి బోయిరి. గృహరాజమును నిర్మించినతరువాత అచ్చటికి ధరణీ శుడు నాతని పడతియు బోవుట కిది రెండవసారి. ఆ గోపురము ఎంత రమణీయమైనదో అంత భీకరమైనది. గోపురద్వారమును జొచ్చి, కుమారగిరి ప్రియాంగన దిక్కుముఖుడై,

'లకుమా! నీవు నిర్దోషివికదా ?' అని ప్రశ్నించెను.

'చిత్తము జగత్ప్రభూ! పరీక్షింపవలయునుగదా!'

'పరీక్షయే మా యభిమతమును.'

'దేవర చిత్తము ఈ దీనురాలిభాగ్యముగదా!'

'ఈ గోపుర శిఖరముననుండి నీవు అధోభాగము నకు దుముకవలయును, నీవు నిర్దోషివని నిరూపించుకొనుటకై. చావక బ్రతికియుంటివేని, నీ హృదయము నిష్కలంకము....ఆవల నా భాగ్యము.'

'ఏ త్రిపురాంతకుని సాన్నిధ్యమున ఈదీనురాలిని జగత్ప్రభువులు చరణదాసిగ స్వీకరించిరో ఆ త్రిలోక వంద్యుని స్మరించి మీయాజ్ఞను శిరసావహింతును' అని బలికి,

"ఓపార్వతీ ప్రాణవల్లభా, మృడా, మహేశా, మృత్యుంజయా రక్షింపుము" అనుచు, నాతరుణి లకుమ, గృహరాజగోపుర శిఖరముననుండి క్రిందికి దుమికెను. రాజేంద్రుడు నిశ్చేష్టుడయ్యెను. ఊరక ఆశాంతములందు దృక్కులు సారించెను.

లకుమాదేవి ధరించిన పావడ అపుడామెకు రక్షణసాధన మయ్యెను. మృత్యువాత బడదలచి నాట్య శాస్త్రోపాధ్యాయిగావున, ఆమె ఒయ్యారముగ దుమికెను. ఆ యొయ్యారము శోభనాస్పదమై వెల్గు చుండ, ధరించినట్టిపావడ విచ్చినఆతపత్రమట్లు రక్షింప మెల్లగ నాకల్యాణి నేలకు వ్రాలెను.

ఆ సంరంభము నంతయు జిలకించుటకై రాణి వాసమునందలి దాసదాసీజన మంతయు నొక్కసారిగా గుమిగూడిరి. వారి నందరిని గాంచి లకుమ తల యెత్తలేక పోయెను. మూడులోకములుగూడ పైబడి యొక్క మారు ఆమెను అధోగతిని ద్రోసినట్లు ఆమెకు బోడ గట్టెను. మహారాజు సంభ్రమముతో నొక్కత్రుటిలో తనదేవేరి చెంతకు వచ్చి నిలువబడెను.

లకుమ ప్రాణేశుని ముఖముపై మరల దృష్టి సారింపలేదు.

"భవహరా! శివా! పశుపతీ- ఈపాపిని రక్షింపుము" అని ఆమె యెలుగెత్తి యరచెను. ఉత్తర క్షణమున - ధరణికాంతునివైపు దిరిగి,

"ప్రాణవల్లభా! తమ పరీక్ష పూర్తియైనది. నేను అకలంకను. కాని నేను తమ చరణదాసిగా నుండ నన ర్హను. క్షమింపుడు. లజ్జానలము నన్ను కాల్చియు, చావ నీయకున్నది. వజ్రాఘాతముకంటె పరుషమయ్యెను భవదాజ్ఞ నాకు మృత్యువును చూపలేదు.........

...మానధనులగు మానినులకు మృత్యువు కోరిన వచ్చును. ప్రాణవల్లభా! క్షమింపుడు. శివా! త్రిపురాంతకా! అమరేశ్వరా! శరణు-" అని అనుచు ఒడ్డాణములో దాచుకొనియున్న చేకత్తిని తటాలున దూసి వక్షస్థలము పై గ్రుచ్చుకొనెను.

* * *

ప్రాణవిహీనయయ్యును రక్తసరసియందు చెన్ను చెదరని సౌందర్యముతో ప్రకాశించు నాయంగనను జూచి హా హా కారము చేయుచు, రాజేంద్రుడు పరువెత్తిపోయి, పదిఅడుగులు దాటకుండగనే మూర్ఛ వడి పోయెను.

* * *

లకుమాదేవి వియోగము కొమరగిరి రాజునకు అశనిపాతముకంటె దారుణముగ బాధాకరమయ్యెను. అతనిచిత్తము స్థైర్యమును గోల్పోయెను. అతడు బుద్ధి

మాంద్యము నొందెను. ఆరోగ్యము ఒక్క ముహూర్తములో ఆతని విడిచిపోయెను. ఆతడు పూర్వపు మనిసి మరల కాలేదు. మంచముబట్టి మరల దిగలేదు. రాజ్యభారమును భార్గవమతియును, గురుసదృశుడునైన కాటయ వేముడు పూనియుండి ధరణీస్థలిని రక్షించెను.

గృహరాజముపై కొన్నిదినములకు పిడుగుపడియెను. సర్వము నక్కడ నొక్క త్రుటిలో కూలిపోయెను. పూర్వక్షణమునందు శోభనము ముడివడుచున్న సౌధరాజము, ఉత్తరక్షణముననే కూలిపోయెను. ఇప్పుడా గృహరాజముయొక్క చిన్నెలయిన అచ్చట గానరావు.

* * *

## పరిశిష్టము

ఇంతవఱకు చదివినదంతయు కేవల కల్పనా కథ గాని చరిత్రగాదు. లకుమాదేవి, కుమారగిరి వసంత భూపాలుడు, కాటయ వేమారెడ్డి, యిమ్మడి హరిహర రాయ మహారాయలునుమాత్రము చారిత్రక పాత్రములు. గృహరాజు సౌధమును చరిత్రయందు ప్రసిద్ధికెక్కినదే! "హర్మ్యనమరావతికి జోడ"యిన కొండవీడు ఒకనాడు ఆంధ్రమహానగరమై విరాజిల్లెను. ఇట్టిచరిత్ర ప్రసిద్ధములయిన సామగ్రియందు ఒక కల్పనాకథను పొదివినారము! చదువరి యీ కల్పనను చరిత్రయని భ్రమపడి మోసపోకుందురు గాక!

---

# ఆహ్వానము

శ్రీ గుఱ్ఱం వేంకట సుబ్రహ్మణ్యాం

అవలితీర మాహ్వానము నంపుచున్న
ది మృదులసమీరములచేత దినదినమ్ము;
అచటిసౌరభ్యముల నొకింత చవి చూపి
యాస వెట్టుచున్నది; దూతలట్లు వీచి
కలు పదములఁ జుట్టుకొని నవ్వులొలయనను
గదలి రమ్మనును; విచిత్రకాంతు లడర
శక్రచాపతోరణ మదె స్వాగతాంక —
మైన నాకేమొ పోవలె ననుతలంపు
పుట్టుకున్నయది, స్వాయమ కట్టుకొంటి
నీకుటీర, మీమల్లిక లేన నాటి
యల్లువెట్టితి, నగ్గెడ హద్దులేర్ప
రచితి, 'నా'యను భావమ్ము ప్రచురమయ్యె;
నీ 'యహం'భావ మేదిన నే మొదవునో
యెఱుఁగ;ననుభవించినఁ గల్గు నెఱుక యనిన
నే నెటులు నమ్ముకొని పోదు నిచటు వాసి.

---